క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పామిడి నూర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ ముఖ్యనాయకుడు పామిడి నూర్ సోమవారం వైఎస్సాఆర్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి స్వగృహంలో పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పార్టీ మైనార్టీ పట్టణ కన్వీనర్ పామిడి జాకీర్, కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీం, మైనార్టీ నాయకులు పామిడి నిజాం, పామిడి హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా ఓబయ్య ఆశయాలు కొనసాగిద్దాం



ఇండియా ఓబయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం: స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ ఎమ్మెల్సీ ఇండియా ఓబయ్య ఆశయాలను కొనసాగిద్దామని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 15వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక టీ సర్కిల్‌లో ఓబయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం ప్రాంతానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కుమారుడు ఐ.సుధీర్, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, అభిమానులు బిక్కిహరి, రిటైర్డ్ ఎంఈఓ ఈరన్న, వినియోగదారుల సంఘం నాయకులు చల్లా కిశోర్ చౌదరి, రోజ్లీ రాజేష్, మాజీ ఎంపీటీసీ గోవిందరాజులు, నాయకులు ఈడిగ లోక్‌నాథ్, ఈడిగ వెంకటేశులు, మాల ఎర్రిస్వామి, నాగరాజు, షేక్షావలి, హబీబ్, అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శెట్టూరు: మండలంలోని కనుకూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు టెన్నికాయిట్ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అనంతపురం జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి అండర్ -14, అండర్ -17 రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ క్రీడలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుధ తెలిపారు. ఇందులో విద్యార్థినులు జ్యోతిక, అనుష్క, స్పందన, పూజ, దివ్య, సుప్రియ, దీక్షిత, విద్యార్థులు గురుస్వామి, యశ్వంత్, మహిధర్, లతీఫ్, చిన్నికిష్ట ఉన్నారన్నారు. ఒకే పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణిస్తున్నందుకు సర్పంచ్ వెంకటేశులు, కమిటీ మెంబర్ కిష్టప్ప, పీడీ అమరాంజనేయులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు క్రీడాకారులను అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామానికి చెందిన బోయ ధనుంజయ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో భార్యతో గొడవపడిన ఆయన మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కాగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నీటి గణన పక్కాగా చేయండి



మాట్లాడుతున్న ఏఎస్ఓ ఆదినారాయణ రెడ్డి

కళ్యాణదుర్గం: గ్రామాల్లో వాటర్ బాడీ (నీటి) గణన పక్కాగా చేయాలని ఏఎస్ఓ ఆదినారాయణరెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుతో కలసి ఆయన వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నీటి లభ్యత ప్రాంతాలు వంకలు, వాగులు, చెరువులు వాటిని లెక్కించి, ప్రస్తుత నీటి సామర్థ్యం, నీటి నిల్వ, నీటి సరఫరా అయ్యే ప్రాంతాలు తదితర వాటిపై పరిశీలించాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సాగునీటి కమిటీల వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు.

ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకం

- జగన్ పాదయాత్రకు ఆరేళ్లు పూర్తి
- మిన్నంటిన వైఎస్సార్‌సీపీ సంబరాలు



రాయదుర్గంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న గౌని ఉపేంద్రరెడ్డి, పోరాళ్ల శిల్ప, నాయకులు



ఉరవకొండ: ప్రజాసంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గంటౌన్/రాయదుర్గం/బొమ్మనహాళ్/కణేకల్లు/గుమ్మఘట్ట/ఉరవకొండ/బెళుగుప్ప/కంబదూరు: ఎన్నికలకు ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకమని అని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హోదాలో అప్పట్లో చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర నవంబర్ 6వ తేదీతో ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాయదుర్గం పట్టణంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. సోమవారం వైస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ అరవా శివప్ప అధ్యక్షతన పట్టణంలోని గోపాల్‌రావు క్లినిక్ వద్ద, శాంతినగర్ వద్ద గల వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రతో ప్రజల మన్ననలు పొంది అధికారంలోకి వచ్చిన తక్షణమే నవరత్నాలతో మేనిఫెస్టోలోని హామీలను దాదాపు 99 శాతం అమలు చేసిన దేశంలోనే ఏకైక నేత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస యాదవ్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో సంబరాలు మిన్నంటాయి. ఆయా గ్రామాల్లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డి హీరేహాళ్‌లో నేతల సంబరాలు



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో..



కణేకల్లులో..



కంబదూరులో ..



బెళుగుప్పలో ..



వజ్రకరూరులో..

ప్రజాభీష్టం మేరకే స్థలాల పంపిణీ



తహసీల్దారు ఈరమ్మకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు

విడపనకల్లు: విడపనకల్లులో ప్రజల అభీష్టం మేరకే స్థలాలపంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసన్న, ఎస్సీ సెల్ జిల్లా జిల్లా కార్యదర్శి సుంకన్న అన్నారు. సోమవారం వారు తహసీల్దారు ఈరమ్మను కలసి ఇళ్ల స్థలాలు త్వరగా పంపిణీ చేయాలని వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విడపనకల్లులో మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి గడపగ గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినప్పుడు చాలా మంది లబ్ధిదారులు జగనన్న లేఅవుట్ దగ్గరలోనే శ్మశానం ఉందని, మరో చోట ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారన్నారు. ఇందుకు ఆయన స్పందించి అర్హులందరికీ మరోచోట స్థలాలు పంపిణీ చేయాలని రెవన్యూ అధికారులకు ఆదేశించారన్నారు. అయితే తెలుగుదేశం పార్టీ నాయకులు విడపనకల్లులో ఏతో జరిగిపోతుందని నిరుపేదలైన అమాయక ప్రజలలకు లేనిపోని అపద్ధాలు చెప్పి,వైఎస్సార్‌సీపీ పార్టీపై అభాండాలు వేసి పబ్బం గడుపుకోవడం సిగ్గు చేటన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుతంత్రాలు చేసినా విడపనకల్లులో అర్హులైన ప్రతి ఒక్కరికీ కూడా పట్టాలిచ్చి ఇల్లు కట్టించి తీరుతామన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ అర్హులందరికీ పాత పట్టాలు రద్దు చేసి నూతనంగా పట్టాలు ఇస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచు మోదులపల్లి రామాంజనేయులు, దేవరాజు, నాయకులు దేశాయ్ సిద్దార్థ, కురుబ గిరిబాబు, రఘురాం, రాజశేఖర్, దేవేంద్ర, ఎంపీటీసీలు మహేశ్, ఓబుళేసు,తిమ్మారాజు, మల్లికార్జున, కోఆప్షన్ మెంబర్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జేజేఎం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు



మాట్లాడుతున్న ఎంపీపీ కమలమ్మ

కుందుర్పి: జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని అధికారులు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు ఆయా గ్రామాలకు సంభందించిన వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బెస్తరపల్లి-జంబుగుంపల రోడ్డును మరమ్మత్తులు చేయాలని సభ్యులు అనిత, గంగాధర కోరారు. మహంతపురం గ్రామానికి శ్మశాన స్థలం చూపాలని సభ్యుడు ఈరన్న కోరారు. అప్పిలేపల్లి సర్పంచ్ అతావుల్లా, బసాపురం ఎంపీటీసీ సభ్యుడు భీమిరెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభమైన తరుణంలో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ లక్ష్మీనరశింహ, సీడీపీఓ వనజ అక్కమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, వైస్ ఎంపీపీ శ్రీలక్ష్మి, ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

'స్పందన'పై నిర్లక్ష్యం చేయొద్దు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత

కళ్యాణదుర్గం: ప్రతి వారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంతో పాటు ఆయా మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని ఆర్డీఓ రాణి సుస్మిత సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల ప్రజలిచ్చిన అర్జీలను స్వీకరించారు. కాగా అధికంగా భూ సంబంధిత సమస్యలు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఆయా మండల స్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు స్పందన అర్జీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలన్నారు. స్పందనకు పలు శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారని, విధుల పట్ల నిర్లక్ష్యం వీడాలని ఆర్డీఓ సూచించారు.

భూసమస్యలపై నిర్లక్ష్యం వద్దు

కూడేరు: 'స్పందన' కార్యక్రమంలో వచ్చే భూసమస్యల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని తహసీల్దార్ శేషారెడ్డి సూచించారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో ఆర్ఐ ప్రసన్నకుమార్, వీఆర్వోలతో సమావేశమయ్యారు. ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. నిబంధనల మేరకు భూసమస్యలకు పరిష్కార మార్గం చూపాలని సూచించారు. రీ సర్వే జరిగే గ్రామాల్లో సర్వేయర్లకు సహకరించాలన్నారు.

పయ్యావుల జల రాజకీయాలు

- నాలుగున్నరేళ్లుగా ప్రజలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం
- ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓట్ల కోసం గిమ్మిక్కులు



నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకులోకి నీటి పంపింగ్ జరుగుతున్న దృశ్యం



నిండిన విడపనకల్లు ట్యాంకును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: ఎంతో నమ్మకంతో నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన వ్యక్తి నాలుగున్నరేళ్లుగా కనబడకుండా పోయారు. ఏ రోజూ నియోజకవర్గంలో ప్రజలు ఎలా ఉన్నారు? వారి సమస్యలు తెలుసుకున్న పాపాన పోలేదు. కేవలం తన పబ్లిసిటీ పిచ్చితో విజయవాడ, హైదరాబాద్ కేంద్రంగా అప్పుడప్పుడు ప్రెస్‌మీట్‌లు పెట్టడం ఆయన స్టైల్. ఆయన ఎవరో కాదు ఉరవకొండ ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ప్రజలు గుర్తుకు రావడంతో ఓట్ల కోసం గిమ్మిక్కు రాజకీయాలకు తెరలేపారు.

జల రాజకీయాలకు తెర

నాలుగున్నరేళ్ల కాలంలో ఏరోజూ నియోజకవర్గంలో తాగునీటి సమస్య గురించి మాట్లాడని ఎమ్మెల్యే కేశవ్‌కు ప్రస్తుత తీవ్ర వర్షాభావం, కరువు పరిస్థితుల్లో నెలకొన్న తాగు, సాగు ఎద్దడిని ఆసరాగా చేసుకుని ఉనికిని కాపాడుకోవడానికి జల రాజకీయాలకు తెరలేపారు. ఇప్పటికే నియోజకవర్గంలో టీడీపీ ఉనికి ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో ఆయన జల రాజకీయాలను ప్రజలు నమ్మే పరిస్థితి కన్పించడం లేదు. ఓట్ల కోసమే రాజకీయాలు చేయడం పట్ల ఆయనను ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారు. రాజకీయ లబ్ధి కోసం అధికారులను బెదిరించడం, ఆల్టిమేటం జారీ చేయడం లాంటి డ్రామాలు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

ఎస్ఎస్ ట్యాంకుల్లో నీటి పంపింగ్

ఉరవకొండ మండలంలోని నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఇప్పటికే పూర్తిస్థాయిలో నింపారు. ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఎస్ఎస్ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపేలా చర్యలు చేపట్టారు. దీంతో పాటు విడపనకల్లు ఎస్ఎస్ ట్యాంకులను కూడా ముందస్తుగానే పంపింగ్ చేపట్టి నింపేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కృషి ఫలితంగా పట్టణంలో రూ.3 కోట్ల వ్యయంతో జల జీవన్ మిషన్ పైప్‌లైన్ పనులు వేగవంతంగా చేపట్టడం, ప్రతి వార్డులో ట్యాంకులు ఏర్పాటు చేసి ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చేశారు.

ఓట్ల కోసమే కేశవ్ జల రాజకీయాలు



కేవలం ఓట్ల కోసమే ఎమ్మెల్యే కేశవ్ జల రాజకీయాలు చేస్తున్నాడు. నాలుగున్నరేళ్లలో ఏ రోజూ నియోజకవర్గ ప్రజల మోహం చూడని వ్యక్తి కరువును అవకాశంగా తీసుకోని డ్రామాలు మొదలు పెట్టాడు. కేశవ్ గిమ్మిక్కులు ఈసారి ప్రజలు నమ్మి మోసపోయేందుకు సిద్ధంగా లేరు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ఎంతో సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులను అప్రమత్తంగా చేసి యుద్ధ ప్రాతిపదికన ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపాం.

– వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, ఉరవకొండ

పైపుల విషయంలో గొడవ

కళ్యాణదుర్గం: ఇద్దరు రైతుల మధ్య స్ప్రింకర్ పైపుల విషయంలో గొడవకు దారి తీసింది. ఈ ఘటన కళ్యాణదుర్గం మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన వెట్టి ఓబిలేశు అదే గ్రామానికి చెందిన మరో రైతు ఆంజనేయులుకు చెందిన స్ప్రింకర్ పైపులను తీసుకెళ్లాడు. పంట పూర్తికాగానే వెట్టి ఓబిలేశు వద్ద ఉన్న పైపులను ఆంజనేయులు చెప్పాడని మరో రైతు ఈడిగ చంద్రప్ప తీసుకెళ్లాడు. ఏడాది తర్వాత ఆంజనేయులు వెట్టి ఓబిలేశు వద్దకు వచ్చి పైపులు ఇవ్వాలని కోరాడు. దీంతోచంద్రప్ప వద్దకు వెళ్లి ఓబిలేశు పైపులు అడగగా పైపులు లేవు..ఏం లేవు అంటూ దబాయించాడు. చేసేదేమీలేక ఆచప ఆంజనేయులుకు కొత్త పైపులు కొనుగోలు చేసిచ్చాడు. ఆదివారం రాత్రి చంద్రప్ప వద్దకు వెళ్లి పైపుల ఖర్చు అయినా ఇవ్వాలని కోరగా చంద్రప్ప కుమారులు ఈడిగ మణెప్ప, ఈడిగ చైతులు తదితరులు ఓబిలేశుపై దాడి చేశారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డి.కొండాపురంలో పశువైద్య శిబిరం

రాయదుర్గం రూరల్: మైక్రో వాటర్‌షెడ్ గ్రామం డి.కొండాపురంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆవులదట్ల వెటర్నరీ డాక్టర్ ఎ.శిరీష తెలిపారు. శిబిరంలో 29 పశువులకు చూలు పరీక్షలు నిర్వహించారు. అలాగే 312 పశువులకు గోమార్ల మందులు, 12 దూడలతో పాటు 157 గొర్రెలు, 45 మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అలాగే 32 సాధారణ పశువులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్ , ఎంపీటీసీ శివప్ప, వాటర్‌షెడ్ చైర్మన్ ఆంజనేయులు, పీఓ శ్రీవిద్య, టెక్నికల్ ఆఫీసర్ ఈరన్న, విశ్వేశ్వర, పశు సంవర్ధక సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ప్రభుత్వ మేలును వివరిద్దాం

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును మండలంలో ఈ నెల 9 నుంచి జరిగే 'ఏపీకి జగనన్న ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలకు వివరిద్దామని ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. ఏపీకి జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమ నిర్వాహణపై సోమవారం ఎంపీపీ చాంబర్‌లో సచివాలయ ఇన్‌చార్జులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. అందరూ అంకితభావంతో సమష్టిగా పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వారు కోరారు.

వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం: మండలంలోని గరుడాపురం సమీపంలో సోమవారం సాయంత్రం బొలరో- బైకు ఢీ కొన్నాయి. పోలీసుల వివరాల మేరకు.. కొత్తూరుకు చెందిన హరిజన రామాంజనేయులు ద్విచక్రవాహనంలో కళ్యాణదుర్గం వైపు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. గరుడాపురం వద్దకు రాగానే ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని ఢీ కొట్టాడు. ఘటనలో హరిజన రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు ఇంటి పట్టాల పంపిణీ

ఉరవకొండ: పట్టణంలోని ఈద్గా దగ్గర 589-5 సర్వే నెంబర్‌లోని లేఅవుట్‌లో స్థలాలు చూపించిన లబ్ధిదారులకు మంగళవారం పట్టాలు పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు, రెవెన్యూ అధికారులు సోమవారం వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి లబ్ధిదారులు హామీపత్రంతో పాటు ఆధార్ జిరాక్స్, రెండు పాస్ ఫోటోలు తీసుకురావాలన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్‌గా పదోన్నతి

కూడేరు: మండలంలోని గొటుకూరు సచివాలయంలో పశుసంవర్ధక ఏహెచ్ఏగా విధులు నిర్వర్తిస్తున్న సుబహాన్‌కు వీఏ(వెటర్నరీ అసిస్టెంట్)గా పదోన్నతి లభించింది. పదోన్నతిపై గార్లదిన్నె మండలానికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. దీంతో ఆయన సోమవారం రిలీవ్ అయ్యారు.

నివాళి

విడపనకల్లు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తలారి తిప్పన్న(75) సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, పార్టీ మండల కన్వీనర్ బసన్న, మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న,డిష్ వెంకటేశులు తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

టీడీపీ నాయకుడి ఇంట్లో మద్యం లభ్యం

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లిలో టీడీపీ నాయకుడు (8 వ వార్డు మెంబర్ భర్త) తిప్పేరుద్ర ఇంట్లో సెబ్ పోలీసులకు దాడులు నిర్వహించి 288 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై ఎక్సైజ్ కేసు నమోదు చేశారు. అలాగే గొల్లపల్లి గ్రామం వద్ద రాయదుర్గం పట్టణానికి చెందిన నాగరాజు నుంచి 48 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు.

కరుణ చూపిన వరుణుడు



బొమ్మనహాళ్‌లో ప్రవహిస్తున్న వేదావతి హగరి

రాయదుర్గం/బొమ్మనహాళ్: వరుణదేవుడు కరుణ చూపాడు.. ఆదివారం రాత్రంతా పలు చోట్ల వానలు దచ్చికొట్టడంతో వాగులు, వంకల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. సోమవారం రోజంతా మేఘవృతమై చిరు జల్లులు కురిశాయి. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో 185.6 ఎంఎంగా వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్ లో 58 ఎంఎంగా అత్యధికం కాగా, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కుందుర్పి, శెట్టూరులో అత్యల్పంగా నమోదైంది. పంటపొలాలన్నీ కళకళ లాడుతున్నాయి. బొమ్మనహాళ్ మండలంలోని వేదావతి హగరి ప్రవహించింది. డి హీరేహాళ్ లో 26.4, గుమ్మఘట్టలో 19.8, కణేకల్లులో 3, రాయదుర్గంలో 14.2, కళ్యాణదుర్గం 15.6, బ్రహ్మసముద్రం 29.2, బెళుగుప్ప 7.2 వర్షపాతం నమోదైంది. కాగా బొమ్మనహాళ్ మండలంలోని పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మిరప రైతులకు నష్టం వాటిల్లింది.

ఉపాధ్యాయురాలికి సన్మానం

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు కల్పనను ఘనంగా సన్మానించారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ప్రధానోపాధ్యాయుడు జిలాన్, ఉపాధ్యాయులు శశికళ, సీఆర్‌పీ రవికుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ తదితరులు ఆమెను సత్కరించారు.

కర్మాగారంలో వివాదం

బొమ్మనహాళ్: మండలంలోని జిందాల్ కర్మాగారంలో ఇరువర్గాలు వివాదం చేసుకున్న సంఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కర్మాగారంలో లారీ డ్రైవర్లు, సెక్యూరిటీ సిబ్బంది మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆదివారం సాయంత్రం లోడింగ్ కోసం లారీలను వరుస క్రమంలో పెట్టే విషయంలో ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసినట్లు సమాచారం. యజమాన్యం సమాచారం ఇవ్వడంతో పోలీసులు రంగప్రవేశం చేసి గొడవ సద్దుమణిగే ప్రయత్నం చేసినప్పటికీ వారి సమక్షంలో కూడా మరోసారి గొడవ చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ శివను వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు అందలేదన్నారు.

'గుడికట్ల సంబరాలకు తరలిరండి'

వజ్రకరూరు: అనంతపురంలో ఈ నెల 19న నిర్వహించే కురుబల గుడికట్ల సంబరాలకు తరలిరావాలని కురుబసంఘం నాయకులు కోరారు. సోమవారం మండలంలోని తట్రకల్లు, గంజికుంట గ్రామాల్లోని మడిచేడప్పస్వామి, నీలగిరిస్వామి, అయ్యలదప్పస్వామి ఆలయాల్లో ఆహ్వాన పత్రికలు అందజేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో కురుబలను ఆహ్వానించారు. కార్యక్రమంలో కుల గురువు చాబాల అర్జున్‌స్వామి, సంఘం నాయకులు ఈశ్వరయ్య, శివలింగ, చిన్నపులి కొండ, గోపాల్, బూదగవి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.74 వేల రికవరీకి ఆదేశం

కళ్యాణదుర్గం: మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకూ జరిగిన ఉపాధి పనులపై ఇటీవల 17వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించారు. సుమారు రూ.7.50 కోట్లకు పైగా జరిగిన పనులపై ప్రజావేదికలో ఆయా గ్రామ పంచాయితీల్లో జరిగిన అవినీతిని అధికారులు నిగ్గు తేల్చారు. మండలంలో మొత్తంగా రూ.74,407 రికవరీకి ఆదేశించారు. మిగిలిన కొన్ని పనులకు చెల్లించిన మొత్తంపై రీ వెరిఫికేషన్ చేయించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

'గడప గడప' నిధులతో డ్రైనేజీ నిర్మాణం

బెళుగుప్ప: మండల కేంద్రంలో శీర్పి రోడ్డు నుంచి వినాయక నగర్ అంబేడ్కర్ కాలనీ వరకూ రహదారి ప్రక్కన డ్రైనేజీ కాలువ పనులను ప్రారంభించారు. సుమారు రూ.10 లక్షల 'గడప గడప' నిధులతో పనులను చేపట్టామని ఎంపీపీ పెద్దన్న, బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప తెలిపారు. సోమవారం నిర్మాణ పనులను పార్టీ నాయకులతో కలసి వారు పరిశీలించి నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, ఉప సర్పంచ్ పాతన్న తదితరులు పాల్గొన్నారు.